
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
బుధవారం 7 ఆగస్టు 2024



దోమలపై సమరం



- వ్యాధుల నియంత్రణకు చర్యలు
- ముమ్మరంగా ఫాగింగ్
- ప్రజల ఆరోగ్యం కోసం బల్దియా అవగాహన కార్యక్రమాలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6: వరుసగా కురుస్తున్న వర్షాలతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఇక్కడ, అక్కడ అనే తేడా లేకుండా సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, చలి జ్వరాలు పంజా విసురుతున్నాయి. దీంతో నగరపాలక సంస్థ వాటికి కారణమైన దోమలను నియంత్రించేందుకు చర్యలు ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం..పచ్చదనంలో భాగంగా పారిశుధ్యం, వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలతోపాటు కరపత్రాలను పంపిణీ చేస్తోంది. మరోవైపు సీజనల్ వ్యాధులకు కారణమైన దోమలను నియంత్రిస్తే వ్యాధులు తగ్గిపోతాయనే అభిప్రాయంతో దోమల నివారణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించింది.

● డివిజన్లలో పారిశుధ్య పనులు

డివిజన్లలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టడంతోపాటు ఇళ్ల మధ్యన, ఖాళీ స్థలాల్లో నిలిచిన వరద నీటితోపాటు మురుగునీరు నిలువకుండా మళ్లించే కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యంగా శివారు కాలనీలు, విలీన డివిజన్లలో వ్యాధులు పంజా విసురుతుండడంతో ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. నాలుగు ఫాగింగ్ యంత్రాలతో ప్రతి పదిహేను రోజుల కొకసారి డివిజన్ మొత్తంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతోపాటు హ్యాండ్ పంపుసెట్లతో కూడా ఇళ్లలో దోమల మందు పిచికారీ చేయిస్తున్నారు. చెత్త కుప్పల వద్ద బ్లీచింగ్ చేయించడం వంటి చర్యలను చేపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు స్వశక్తి మహిళలు, యువతను డివిజన్లలో భాగస్వాములను చేసి అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను నిర్వహించాలని నిర్దేశించారు.

● ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు

ఖాళీ స్థలాల్లో నీరు నిలువడంతో వాటిలో దోమల లార్వాతో దోమలు వృద్ధి చెందుతున్నందున ఖాళీ స్థలాల యజమానులు నీరు నిలువకుండా చూసుకోవాలని బల్దియా అధికారులు, మేయర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఖాళీ స్థలాల పరిసరాల్లోని ఇంటి యజమానులు ఖాళీ స్థలాలకు సంబంధించిన చిరునామాను తెలిపితే వారికి బల్దియా నుంచి నోటీసులు జారీ చేస్తారు. అప్పటికీ వారు స్పందించకపోతే నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నీటిని మళ్లించి అందులో నీరు నిలువకుండా చర్యలు చేపడతారు. అందుకు చేసిన ఖర్చుతోపాటు ఫెనాల్టీలను కూడా వసూలు చేస్తామని అధికారలు, మేయర్ హెచ్చరించారు.

నగర ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

- మేయర్ సునీల్‌రావు

నగరప్రజల ఆరోగ్య రక్షణకు తమ పాలకవర్గం ప్రాధాన్యమిస్తామని మేయర్ సునీల్‌రావు అన్నారు. కార్మికులుకు ఆధునిక యంత్రాలను అందించడమేకాకుండా అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నామని, పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేసేందుకు అధికారులను ఆదేశించామని చెప్పారు. డివిజన్లలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామని తెలిపారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి

- ప్రతి సబ్ సెంటర్‌లో ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలి
- ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వాతా వరణంలో సంబ విస్తున్న మార్పులతో డెం గ్యూ, సీజనల్ వ్యాదులు ప్రబల కుండ అధికారులు అప్రమత్తంగా ఉంటు కట్టు దిట్టమైన చర్యలు తీసుకో వాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అధికారులు అక్టోబరు వరకు అప్రమ త్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రతి సబ్‌సెంటర్‌లో ర్యాపిడ్ టెస్టులను నిర్వహిం చాలని, ప్రతిరోజు ఫీవర్ సర్వేను నిర్వహిం చాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసు పత్రులు, పాథాలజీ కేంద్రాల ద్వారా నిర్ధారించే డెంగ్యూ కేసుల గురించి తెలుసుకుని, ప్రత్యేక చర్యలు తీసుకో వాలన్నారు. రోగు లకు అవసరం మేర రక్తాన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వ్యాధులు, దోమలు, లార్వా వృద్ధి చెందకుండా తక్షణ చర్యలను చేపట్టాల న్నారు. వీధి కుక్కలు, కోతుల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని ఎప్పటిక ప్పుడు పరీక్షించా లన్నారు.స్వచ్ఛదనం- పచ్చదనం కార్య క్రమాన్ని విజయవంతం చేయా లని, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేలా ప్రత్యేక కార్యక్రమాలను చేప ట్టాలని సూచించారు. కోర్టు వద్ద మంచినిటి ట్యాంకు వద్ద నీటి సరఫరా లో లెవల్, హై లెవల్, గ్రావిటి వివరాలను మే యర్ ద్వారా తెలుసు కుని, క్లోరోస్కోప్ ద్వారా ట్యాంకులోని నీటిని సాంద్రతను పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ వై సునీల్ రావు, డీఆర్డీవో శ్రీధర్, డీపీవో రవీందర్, డీఎంహెచ్‌వో సుజాత, డిప్యూటి కమి షనర్ స్వరూపారాణి, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ సువార్త పాల్గొన్నారు.

ఇందిర మహిళా శక్తి యూనిట్ల పరిశీలన

కరీంనగర్ రూరల్, ఆగస్టు 6: మండలంలోని నగునూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పౌల్ట్రి మందిర్ యూనిట్లను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్కూల్ విద్యార్థులు, మహిళా సభ్యుల సమక్షంలో నీటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం చామనపెల్లిలోని ఇందిరా మహిళ శక్తి డైరీ యూనిట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు అధికారి సునీత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు రవీందర్, ప్రవీణ్, ఊపీఎం భార్గవ్, సీసీ వనితారాణి పాల్గొన్నారు.

ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి



జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6: ఆచార్య జయశంకర్ జయం తిని నగరంలో మంగ ళవారం ఘనంగా నిర్వహిం చారు. టవ ర్‌సర్కిల్‌లోని ప్రొ ఫెసర్ జయ శంకర్ విగ్రహా నికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర ఆవి ర్భావం కోసం అహర్నిశలు పాటు పడిన గొప్పవ్యక్తి జయ శంకర్ అని కొనియాడారు. ఆయన బతికి ఉన్న సమ యంలో స్వరాష్ట్రం ఏర్పడక పోవడం దురదృష్టకరమ న్నా రు. కేసీఆర్ నాయకత్వంలో జయశంకర్ ఆశయాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెంది, ఆయన ఆశయాలు నెరవేరాయన్నారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ జయశంకర్ ఆశయా లను భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, అదనపు కమిషనర్ సువార్త, ఎస్‌ఈ రాజ్‌కుమార్ తదితరులు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత కుముందు నగరపాలక సంస్థ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కలెక్టరేట్‌లో..

కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బడుగు బలహీన వర్గాల జీవితాలు బాగుపడతాయని అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఆచార్య జయశంకర్ అని అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు పోరాడారని, ఆయన సేవలు మరువలేనివని అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాల్లో అధికారులు చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

ఆర్టీసీ ప్యాకేజీలపై ప్రచారం నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న విలేజ్ ఆఫీసర్లు

భగత్‌నగర్, ఆగస్టు 6: పెళ్లిళ్ల, విహార యాత్రలు, దేవాలయాల సందర్శనకు ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన ఇస్తున్న ప్యాకేజీల గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత అన్నారు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలోని విలేజ్ ఆఫీసర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎక్కువ మొత్తంలో బస్సుల బుకింగ్‌లు వచ్చే విధంగా కృషిచేయాలన్నారు. తమిళ నాడు, అరుణాచలం యాత్రకు స్పెషల్ బస్సుల బుకింగ్ విజయవంతం చేసిన విధంగానే శ్రావణమాసంలో అద్దె బస్సులు ఎక్కువ బుక్ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు కొత్త వాహనాలు

- కార్మికుల శ్రమ ఫలితమే బల్దియాకు గుర్తింపు
- మేయర్ యాదగిరి సునీల్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6: పారిశుధ్య నిర్వహణకు కొత్త వాహనాలను సమకూర్చుతామని, చెడిపోయిన వాహనాలకు 15 రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలు చెడిపోయాయని, వాటిని మరమ్మత్తు చేయాల్సిన అవసరముందన్నారు. కార్మికులు, డ్రైవర్లు టోకెన్ సమ్మె చేయడం సముచితమేనన్నారు. చెడిపోయిన వాహనాలకు 15 రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని, పూర్తిగా పనికిరాని వాహనాల స్థానంలో కొత్త వాహనాలను కొనుగోలు చేస్తామన్నారు. కార్మికులు చేస్తున్న శ్రమఫలితాంగానే నగరపాలక సంస్థకు గుర్తింపు లభిస్తోందని, సఫాయిమిత్ర సురక్షా ఛాలెంజ్‌లో నాలుగు కోట్ల ప్రైజ్‌మనీ వచ్చిందని అన్నారు. ఆ ప్రైజ్‌మనీతో ఇప్పటికే పారిశుధ్య నిర్వహణకు కొన్ని వాహనాలు కొనుగోలు చేశామని, అందులో మిగిలిన 1.5 కోట్లతో మరో 31 ట్రాక్టర్లను త్వరలోనే కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్మికులకు ప్రతినెలా 2,3 తేదీల్లోగానే వేతనాలను చెల్లిస్తున్నామని, వారికి యూనిఫామ్, ఇతరత్రా సామా గ్రిని అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ నగర పాలక సంస్థకు సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సువార్త, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, కార్పొరేటర్లు జంగిలి ఐలేందర్ యాదవ్, నాంపల్లి శ్రీనివాస్, కుర్ర తిరుపతి, కచ్చు రవి, దుర్శేటి అనూప్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం



చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, ఆగస్టు 6: తల్లిపాలు అమృతం లాంటివని కలెక్టర్ పమేల సత్పతి అన్నారు. జిల్లా ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి తల్లి తన పిల్లలకు జన్మనిచ్చిన 24 గంటలలోపు కచ్చితంగా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. అలా పట్టించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని, ఆరు నెలల తరువాత తల్లిపాలతోపాటు పౌష్టికాహారం కూడా అందించాలని సూచించారు. మహిళలు వారి ఆరోగ్యం విషయంలో చాలా ఓపికగా ఉంటారని అన్నారు. ప్రతి తల్లి పుట్టబోయే బిడ్డ గురించి టిఫాస్ స్కాన్ చేయించుకోవాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యమహిళ క్లినిక్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పిల్లలు జన్మించిన తరువాత తల్లులు ఐరన్, కాల్షియం టాబ్లెట్స్ క్రమం తప్పకుండా వాడాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి రోజు ఆరు లీటర్ల మంచినీళ్లు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి సివిల్స్‌కు ఎంపికైన అభ్యర్థులు సాయి, సహన, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి 108 చీరలతో అలంకారం



కరీంనగర్ రూరల్, ఆగస్టు 6: కరీంనగర్ మండలంలోని నగునూర్ గ్రామంలోని శీదుర్గభవానీ ఆలయంలో శ్రావణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు 108 చీరల అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. ఆలయ ధర్మాధికారి, వేద పండితుడే పురాణం మహేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సౌందర్యలహరి పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, కార్పొరేటర్ వంగళ శ్రీదేవి పవన్‌కుమార్ పాల్గొన్నారు.





మద్యం షాపులో చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: కరీంనగర్ కోతిరాంపూర్‌లోని మానస వైన్‌షాపులో సోమవారం అర్ధరాత్రి దొంగ చొరబడి కౌంటర్‌లోని 35 వేల రూపాయలు ఎత్తుకుపోయాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి వైన్‌షాపును మూసివేసిన క్యాషియర్ తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి వైన్ షాపు షటర్ గోడ పగులగొట్టి,షటర్ బయటకు లాగి ఉంది. యజమానితో కలిసి లోపలికి వెళ్లి చూడగా కౌంటర్ తెరచి ఉండగా అందులోని 35 వేల రూపాయల నగదు దొంగ ఎత్తుకుపోయినట్లు గుర్తించారు. పోలీసులు షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగ చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. మరొక షాపులో కూడా చోరీకి ప్రయత్నించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై మద్యం మత్తులో పురుగుల మందు తాగిన కరీంనగర్ రూరల్ మండలం చెర్ల బూత్కూర్‌కు చెందిన రంగు శ్రీనివాస్(41) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. గీతకార్మిక వృత్తితో జీవిస్తున్న రంగు శ్రీనివాస్ అప్పుల బాధతో ఈనెల 4న కల్లు గీసేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, ఆగస్టు 6: అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యంను సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మల్యాల మండల కేంద్రంలోని సంగని రాములు అనే వ్యక్తి ఇంటి సమీపంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు రేషన్‌బియ్యంను అక్రమంగా తరలించడానికి నిల్వ చేశారనే సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన డీటీసీఎస్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, బ్లూకోల్ట్ పోలీసులు ప్రసాద్, నర్సింగ్ ఇతర అధికారులు పది క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యంను మల్యాలలోని సివిల్ సప్లై గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు.

రామడుగు: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. వరంగల్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న లారీలో 200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న కందుకూరి మహేష్‌బాబు అనే వ్యక్తి తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ ఆలీమ్‌ఖాన్, గుమాస్తా ల్యాడ నరేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మేకల మందపై చిరుత దాడి

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం గోరంటాల ఎద్దుగుట్ట అటవీ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మేకల మందపై చిరుత దాడి చేసింది. చిరుత ఒక్కసారి మేకల మందపై విరుచుక పడడంతో పరుగులు తీశాయి. మేకల కాపరి శ్రీనివాస్ కొద్దిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. తన చేతిలో ఉన్న గొడ్డలితో కాపరి బెదిరించే ప్రయత్నం చేయడంతో చిరుత అతడి వైపు వెళ్లలేదు. చిరుత అక్కడి నుంచి వెళ్లే క్రమంలోఓ మేకను ఎత్తుకెళ్లినట్టు కాపరి శ్రీనివాస్ తెలిపాడు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు : తప్పిన ప్రమాదం



పొలంలో బోల్తాపడ్డ కారు

రుద్రంగి, ఆగస్టు 6: రుద్రంగి మండల కేంద్రం శివారులోని మూలమలుపు వద్ద సోమవారం రాత్రి కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కారు రుద్రంగి నుంచి కోరుట్ల వైపు సోమవారం రాత్రి 11 గంటలకు వెళ్తుండగా మూలమలుపు వద్ద ఒక్కసారిగా కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సంఘటన స్థలాన్ని రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూవివాదంలో రౌడీషీటర్ అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 6: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ భూపతి వెంకటేశ్‌ను భూవివాదంలో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ ఇదే గ్రామానికి చెందిన పైడి రేవతిపై గత నెలలో పారతో తలపై దాడిచేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వెంకటేశంపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.























సైబర్ వలలో పిల్లల వైద్యుడు

● రూ. 74 లక్షలు కాజేసిన నేరగాళ్లు

మెట్‌పల్లి , ఆగస్టు 6 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడు సైబర్ వలలో చిక్కుకుని ఏకంగా రూ.74 లక్షలు మోసపోయిన ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పిల్లల వైద్యుడు స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ఇన్‌స్టాగ్రాంలో ఓ లింక్‌ను క్లిక్ చేసి ఏసీ మ్యాక్స్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎసెల్ స్టూడెంట్ గ్రూప్‌ను ఫాలో అవుతూ డబ్బులు ఇన్వెస్ట్ చేసాడు. ఎంత డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే అంత పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు సదరు వైద్యుడిని నమ్మించారు. దీంతో వైద్యుడు మొత్తం 74 లక్షల రూపాయలు ఇన్వెస్ట్ చేసాడు. ఇన్వెస్ట్ చేసిన డబ్బులతో పాటు ఇంకా అధిక మొత్తంలో డబ్బులు రావాలంటే ఇంకా జమచేయాలని సైబర్ నేరగాళ్లు నమ్మించే ప్రయత్నం చేసారు. అనుమానం వచ్చిన వైద్యుడు తను ఇన్వెస్ట్ చేసిన డబ్బులు విత్‌డ్రా చేయాలని కోరగా ఇంకా 31 లక్షలు కడితేనే విత్ డ్రా అవుతుందని తెలుపడంతో మోసపోయినట్లు తెలుసుకుని 1930కి కాల్ చేసి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గత నెల 13న ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మోసపోయిన 74,38,812 లక్షలలో 10 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు మెట్‌పల్లి డిఎస్పీ ఉమామహేశ్వర రావు తెలిపారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

17యేళ్ల తర్వాత రాజన్న ఆలయ ఉద్యోగుల బదిలీలు

● 27 మందికి ఉత్తర్వులు ● మూడు రోజుల్లో చేరాలని దేవాదాయశాఖ ఆదేశాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఉద్యోగులను బదిలీ చేస్తూ ఎట్టకేలకు దేవాదాయ శాఖ నుంచి17యేళ్లకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 27 మంది ఉద్యోగులకు యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి దేవాలయాలకు బదిలీచేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా యేళ్ల తరబడి ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయాలనే దేవాదాయ శాఖ భావించి పెద్ద మొత్తంలో ఉద్యోగులకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రాజన్న ఆలయానికి చెందిన ఇద్దరు ఏఈవోలు, ఏడుగురు పర్యవేక్షకులు, ఎనమిది మంది సీనియర్ అసిస్టెంట్‌లు, 10 మంది జూనియర్ అసిస్టెంట్‌లుతో పాటు డీఈని బదిలీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న మూడు రోజుల్లో సంబంధిత ఆలయాల్లో విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వులో ఆదేశాలు జారీ చేశారు.



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

రాజన్న ఆలయం నుంచి బదిలీ అయిన ఉద్యోగులు వీరే

రాజన్న ఆలయంలో ఏఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఈవో ఎస్. హరికిషన్ శ్రీసీతరామచంద్ర స్వామి దేవాలయం భద్రాచలం బదిలీ అయ్యారు. ప్రతాప నవీన్‌కుమార్ శ్రీలక్ష్మీనరసింహా స్వామి ఆలయం యాదగిరిగుట్టకు బదిలీకాగా పర్యవేక్షకులు శ్రీరాములును శ్రీమల్లికార్జున స్వామి ఆలయం కొమురవెల్లికి, నటరాజును శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, హరిహరనాథ్‌ను శ్రీ ఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, లక్ష్మణ్‌రావును శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు, జి. శ్రీనివాస్, నాగుల మహేష్‌లను శ్రీలక్ష్మి నరసింహాస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, అరుణ్‌కుమార్‌ను శ్రీసీతరామ చంద్ర స్వామి ఆలయం భద్రాచలం బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పత్తిపాక శ్రీనివాస్, పచ్చునూరి రాజేందర్, ఎమ్. రవీందర్, పవన్‌కుమార్, రమేష్‌లను శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, భూపతిరెడ్డి, అశోక్‌లను శ్రీఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, సిహెచ్. రాజేశ్వర్‌ను శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు బదిలీలు చేశారు. జూనియర్ అసిస్టెంట్‌లు విధులు నిర్వర్తిస్తున్న ఎన్. తిరుపతి, నగేష్‌రాజు, ఎల్. రాజేందర్, సిహెచ్. లింగయ్య, రామేశ్వరరావులను యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వారి ఆలయానికి, సిహెచ్. శ్రీనివాస్ శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు, తూము శ్రీనివాస్, టి.రవి, ఎస్. నాంపల్లి, కె. రాములలను శ్రీఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, బి. శివరామ్‌ను శ్రీసీతరామచంద్ర స్వామి ఆలయం భద్రాచలం ఆలయాలకు బదిలీలు అయ్యారు.

సుద్దాలలో మహిళ ఆత్మహత్య

సుల్తానాబాద్, ఆగస్టు 6: సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామంలో ఓ వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. సుద్దాల గ్రామానికి చెందిన ఆల్లాడి శ్రీలత (45) గ్రామంలోని వారి స్వంత ఇంటిలో ఒక్కతే ఉంటోంది. ఆమె భర్త ఇరవై సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రస్తుతం మృతురాలి ఇద్దరు కుమారులు కార్తీక్‌రావు, కళ్యాణ్‌రావు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు అందరితో మాట్లాడిన శ్రీలత మంగళవారం తెల్లవారేసరికి ఎంతకూ లేవక పోవడంతో కిటీకిలోంచి చూస్తే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంది. కడుపునొప్పి భరించలేక తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని పెద్ద కుమారుడు కార్తీక్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

మంథనిరూరల్, ఆగస్టు 6: మండలంలోని గుమ్మునూరు గ్రామంలో బండారి రాజ్‌కుమార్(23) అనే యువకుడు ఇంటి ఆవరణలోని రేకుల షెడ్‌లో మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ గుమ్మునూరులోని తన బంధువుల ఇంట్లో ఉంటూ రెండు రోజుల క్రితం మంథనిలో ఓ షాపుకు వెళ్లి నకిలీ ఫోన్‌పే ద్వారా రూ. 300 పంపి నగదు తీసుకున్నాడు. మళ్లీ సోమవారం కూడా అదే షాపునకు వెళ్లి రూ. 500 నకిలీ ఫోన్‌పే ద్వారా పంపి నగదు రూపంలో ఐదు వందలు ఇవ్వాలని షాపు అతన్ని కోరగా తనకు రెండు సార్లు డబ్బులు తన ఖాతాకు రాలేదని గుర్తించిన షాపు యాజమానికి సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో తీసిన వీడియోలను ఓ వ్యక్తి తన సోషల్ మీడియా ద్వారా వైరల్ చేయగా రాజ్‌కుమార్ మనస్థాపం చెంది ఉరివేసుకొని చనిపోయాడని, షాపు యాజమానికి, వీడియో వైరల్ చేసిన వ్యక్తిపై తల్లి తిరుమల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఓదెల, ఆగస్టు 6: మండలంలోని మడకకు చెందిన నేదురి రాజ కొమురయ్య (51) అనే వ్యక్తి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఈ విధంగా ఉన్నాయి. మడకలో పంక్చర్ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజ కొమురయ్య అప్పుల బాదతో పాటు మద్యానికి బానిసై ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యు లు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు.

భోజన్నపేటలో యువకుడు..

పెద్దపల్లి రూరల్,ఆగస్టు 6: మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన కునారపు రవికిరణ్ (31) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి కిరణ్ కరోనాకు ముందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడని కరోనా వచ్చాక ఉద్యోగాన్ని వదిలి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుండి ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో మనస్థాపం చెందేవాడని సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్నట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి , మెరుగైనా వైద్యం కోసం కరీంనగర్ తరలించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా మంగళవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

మామిడాలపల్లిలో వృద్ధురాలి మృతి

వీణవంక,ఆగస్టు6: మండలంలోని మామిడాలపల్లి గ్రామనికి చెందిన దర్పల్లి మల్లమ్మ (80) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లమ్మ, ఒంటరిగా ఉంటూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కూమారుడు దర్పల్లి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

గంజాయి విక్రయిస్తూ హైదరాబాద్‌లో పట్టుబడ్డ పెద్దపల్లి యువకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6: హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తూ పెద్దపల్లి యువకులు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు పట్టుబడ్డారు. ఆంధ్రా ఒరిస్సా బార్డర్‌లో 4 వేల రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేసి హైదారాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురు పెద్దపల్లి యువకులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పన్నపేటకు చెందిన ఆకుల మిత్రచెతన్య, నిట్టూరు కు చెందిన మహ్మమద్ లతీఫ్‌తో పాటు ఇల్లకుంటకు చెందిన దామ్మని అరవిండ్‌లు గుర్తించారు. ఈ గంజాయిని పెద్దపల్లికి చెందిన బండి సాయి చరణ్ విశాఖ సీలేరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తేలింది. వీరిని పట్టకున్న వారిలో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ సీఐ ఓంకార్, ఎక్సై శ్రీనివాసులు, పి, నరేష్‌లు ఉన్నారు.

కొండగట్టులో శ్రావణ సందడి



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శ్రావణ సందడి నెలకొంది. మంగళవారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగ శ్రావణ సప్తాహ ఉత్సవాలు రెండవ రోజు కొనసాగాయి. అంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

త్రివేణి సంగమం పట్టుచీర ఆవిష్కరణ

● సిరిసిల్ల నేత కార్మికుడి మరో ప్రయోగం




పట్టుచీరను అవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

సిరిసిల్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వినూత్న ప్రయోగాలతో చేనేత వైభవాన్ని చాటుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ మరో పట్టుచీరను ఆవిష్కరించాడు. పట్టుచీరకు సంబంధించిన రంగుల డైయింగ్‌కు ఉపయోగించిన నీటిని గంగ, జమున, సరస్వతి నదుల నుంచి తీసుకురావడం విశేషం. రూ.25 వేలు ఖర్చు చేసి 5.50 మీటర్ల పొడవుతో పట్టు చీరను నేశాడు. మూడు నదుల నీళ్లను ఉపయోగించినందున ఈ పట్టుచీరకు త్రివేణి సంగమం సారీగా నామకరణం చేశాడు. మంగళవారం వరంగల్ జిల్లాలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా త్రివేణి సంగమం పట్టుచీరను ఆవిష్కరించారు. ఇప్పటికే విజయ్ అగ్గిపెట్టె, ఉంగరంలో అమిరే చీరలతోపాటు, కుట్టులేని వస్త్రాలు, బంగారు, వెండిని ఉపయోగించి చీరలను నేసి ప్రశంసలందుకున్నాడు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తగ్గిన వరద నీరు

● రెండు మోటార్ల ద్వారా మిడ్ మానేరుకు ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 6: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్న నీటిని అధికారులు తగ్గించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 4,660 క్యూసెక్కుల వరద నీరు మాత్రమే వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసిన అధికారులు సాయంత్రం వరకు ఒక మోటారును నిలిపివేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మరొక మోటార్‌ను నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. బుధవారం ఇన్‌ఫ్లో పెరగకపోతే మిగతా రెండు మోటర్లనూ నిలిపివేసే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు 11 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 9,980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.98 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3. 5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రానికి 1.29 టీఎంసీల నీరు చేరింది. మధ్య మానేరు నుంచి సర్జిపూల్‌లోకి నీరు వచ్చిచేరుతుండడంతో రెండు మోటార్ల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నామని డీఈ దేవేందర్ తెలిపారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

● ఎస్సారెస్పీకి 10,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 10,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.451 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక,ఆగస్టు6: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు మార్త రాజేశం,కర్రే మహేష్, కర్రే నర్సయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఆగస్టు 6: హుజూరాబాద్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. పట్టణంలోని మామిండ్లవాడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 1630 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూకబ్జా కేసులో అధికారి సరెండర్?

జగిత్యాలరూరల్, ఆగస్టు 6: నకిలీపత్రాలు సృష్టించి విలువైన భూమిని కబ్జాకు యత్నించినవారికి సహకరించిన కేసులో గతంలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారి మంగళవారం జగిత్యాల కోర్టులో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే జగిత్యాల పట్టణంలోని స్థానిక హస్నాబాద్ శివారులోగల సర్వేనంబర్ 1599లో గల 12 గుంటల స్థలం కబ్జాచేసిన వ్యవహారం జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తమది కాదని తెలిసిన విలువైన భూమిని కాజేసేందుకు కుట్రపన్ని సదరుభూమికి సంబంధించిన నకిలీపత్రాలు సృష్టించుకున్న ఇద్దరు వ్యక్తులతో పాటు అక్రమంగా వీఎల్‌టీ నంబర్ కేటాయించి సహకరించిన మున్సిపల్ ఆర్ఓ ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. భూకబ్జా వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. అతనితో పాటు జగిత్యాలలో గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారి సైతం పరారీలో ఉండగా మంగళవారం జగిత్యాల కోర్టులో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం తెలిసింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ కర్ణన్

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 6: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆసుత్రిలో ఉన్న డాక్టర్లు, సిబ్బంది వివరాలతో పాటు సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకం పెరిగే విధంగా రోగులకు వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రసవాల కోసం వచ్చే వారిని ప్రైవేట్ ఆసుపత్రులకు పంపించ వద్దని, గర్భిణులు మాతా శిశు కేంద్రానికి వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణిలకు మెరుగైన వైద్యం అందించాలి

సుల్తానాబాద్, ఆగస్టు 6: ప్రభుత్వ అసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రభుత్వ అసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి వివరించారు. ఈ సందర్భంగా కర్ణణ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా ప్రసవాల సంఖ్య పెరిగే విషయంలో జిల్లా అధికారులు దృష్టి నిలపాలన్నారు. సీజనల్ వ్యాధులతో వస్తున్న రోగులకు సత్వర చికిత్సలు అందించాలని సూచించారు. ఆయన వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, మహేందర్, సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కమిషనర్ శోభశంకర్ తదితరులు ఉన్నారు.



సుల్తానాబాద్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కర్ణన్

గంగాధరలో బస్సు, లారీ ఢీ

● లారీ డ్రైవర్ మృతి
● బస్సులోని ప్రయాణికులకు స్వల్పగాయాలు

గంగాధర, ఆగస్టు 6: గంగాధర మండలం కొండన్నపల్లి స్టేజి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి జీజే 06ఎఎక్స్7548 నెంబరు గల అయిల్ ట్యాంకర్ లారీ జగిత్యాల వైపు వెళ్తోంది. టీఎస్ 02 యూబి 7794 ఆర్టీసీ బస్సు నిండుగా ప్రయాణికులతో చిల్వాకోడూర్ నుండి కరీంనగర్ వెళ్తోంది. కొండన్నపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న అయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఢీకొట్టగానే లారీ డ్రైవర్ అఫ్జల్ అలాంకు బలమైన గాయాలై వాహనం అదుపు కాలేక బస్సును కొద్ది దూరం లాక్కెల్లి నిలిచింది. అతికష్టం మీద లారీ డ్రైవర్‌ను స్థానికులు బయటకి తీసిన కొద్ది సమయంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ రాజుకు కాలు విరగగా 12 మంది ప్రయాణికులకు స్వల్పగాయ్యైనట్లు తెలిపారు. గాయపడ్డ ప్రయాణికులను 108లో కరీంనగర్‌కు తరలించారు. ఇదే సమయంలో బీర్‌పూర్ నుంచి కరీంనగర్ వెళ్తున్న టాటా ఏస్ ట్రాలీని వెనకనుండి బస్సు ఢీకొట్టింది. ట్రాలీ డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. ట్రాలీ ముందు భాగం దెబ్బతినగా క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను కష్టంమీద బయటికి తీశారు. ఘటన స్థలానికి ఎస్ఐ కిరణ్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



కొండన్నపల్లి స్టేజీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్న లారీ, బస్సు

పోలీస్‌స్టేషన్‌లో పందెం కోళ్ల వేలం

కమాన్‌పూర్, ఆగస్టు 6: కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం పందెం కోళ్ల వేలం పాట ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో రెండు పందెం కోళ్లకు రూ. 6,500 ధర పలికింది. ఒక పందెం కోడి రూ. 4 వేలకు మండల కేంద్రానికి చెందిన పురాణం సారయ్య దక్కించుకున్నారు. మరో పందెం కోడిని బోనాల సత్యనారాయణ రూ. 2500లకు దక్కించుకున్నాడు. ఈ పందెం కోళ్ల వేలం పాటలో వచ్చిన డబ్బులను కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెల 27న మండ లంలోని పెంచికల్‌పేట గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు జరిపారు. ఏడుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించగా 50 మంది పాల్గొన్నారు.

జ్వరంతో పారిశుధ్య కార్మికుడి మృతి

రాయికల్, ఆగస్టు 6: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య(56) జ్వరంతో బాధ పడుతూ మంగళవారం మృతి చెందాడు. చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య 12 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా రాయికల్‌లో పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న లింగయ్యను కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందజేస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి.. ప్రాణాపాయ స్థితిలోకి...

శంకరపట్నం, ఆగస్టు 6: శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ఓ ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన ముంజ లక్ష్మయ్యకు ఈ నెల 4న సాయంత్రం విరోచనాలు కావడంతో గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. తాను రెండు ఇంజక్షన్లు వేశాడు. తగ్గకపోవడంతో మరుసటి రోజు ఉదయాన్నే ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా రెండు ఇంజక్షన్లు వేసి రెండు గ్లూకోజులు ఎక్కించినట్లు తెలిపారు. లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితి అదుపులో లేకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లనే తన భర్త ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడని భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

చిరుత దాడిలో మూగజీవాల మృత్యువాత

● భయం గుప్పిట్లో గ్రామాలు.. రైతులు ● ఇప్పటికే మూడు మూగజీవాలు మృతి

గంభీరావుపేట, ఆగస్ట్ 6: గంభీరావుపేట మండలం గోరంటాల, దమ్మన్నపేట సరిహద్దు అడవుల్లో చిరుత సంచారంతో ఆ గ్రామాలు భయం గుప్పిట్లో వణికి పోతున్నాయి. అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద ఉండే మూగజీవాలపై చిరుత వరుసగా దాడి చేసి చంపుతోంది. నాలుగు రోజుల వ్యవధిలో చిరుత దాడిలో మూడు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. నాలుగు రోజుల క్రితం గోరంటాల గ్రామానికి చెందిన రైతు రామచంద్రంకు చెందిన రెండు ఆవులపై చిరుత దాడి చేసి చంపేసింది. పొలం వద్ద కొట్టంలో ఉన్న ఆవులపై దాడి చేసి చంపేయడంతో ఒక్కసారి పరిసర గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. ఈ సంఘటన మరువక ముందే దమ్మన్నపేట రైతు నారాయణకు చెందిన దూడపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి చంపేయడంతో ఈ ప్రాంత రైతులు భయం గుప్పిట్లో వణికి పోతున్నారు. దమ్మన్నపేట, గోరంటాల గ్రామాలు పెద్దమ అడవులకు సమీపంగా ఉండడంతో చిరుత సంచారం అధికమైనట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో అటవీ ప్రాంతానికి అనుకొని ఉన్న ముచ్చర్ల గ్రామ సమీపాన చిరుత రెండు సార్లు దాడి చేసి రెండు మూగజీవాలను హతమార్చింది. రాత్రి వేళల్లో ముచ్చర్ల మార్గం గుండా వెళ్లాలంటే ప్రజలను చిరుత భయం వెంటాడింది. తాజాగా గోరంటాల, దమ్మన్నపేట గ్రామ సమీప పొలల వద్ద ఉన్న మూగ జీవాలపై చిరుత విరుచుకుపడి చంపుతోంది. దీంతో రాత్రి వేళల్లో పంట పొలాల వద్ద వెళ్లాలంటే రైతులు భయందోళనకు గురవుతున్నారు. ఆవులను, దూడలను చంపేస్తున్నది చిరుతేనని ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. రెండు గ్రామాలు పక్క పక్కనే ఉండటంతో ఈ ప్రాంతంలో సంసంచరించేది ఒక్కటే చిరుత అని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.



దమ్మన్నపేట వద్ద చిరుత దాడిలో మృతి చెందిన దూడ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అంజలి, డిప్యూటీ రేంజ్ అధికారి



గోరంటాల, దమ్మన్నపేట రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నది వాస్తవమే. దాడులు చేసిన సంఘటనల ప్రదేశాలను పరిశీలించాం. చిరుత అడుగులేనని తేలింది. ఆవులను, పాడి గేదలను, దూడలను రైతులు ఇంటి వద్దే ఉంచాలి. ఈ రెండు గ్రామాల రైతులు రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దు.

ఖాదీ వస్త్రాల అమ్మకాలపై 40శాతం రిబేట్


వస్త్రాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2: నగరంలోని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల మెట్‌పల్లి ఖాదీభవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి పండుగలను పురస్కరించుకొని 40శాతం రిబేట్‌తో అమ్మకాలు చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఖాదీ వస్త్రాలు తగ్గింపు ధరలకు లభిస్తాయన్నారు. నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయాలని ఖాదీభవన్ మేనేజర్ వి.భిక్షపతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డీసీసీ అధికార ప్రతినిధుల అదనపు నియామకాలు చెల్లవు

-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 6: జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధుల అదనపు నియామకాలు చెల్లవని డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 సంవత్సరంలో అప్పటి టీపీసీసీ అధ్యక్షులు ఉత్తం కుమార్‌రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ద్వారా నియామకమైన జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధులుగా ఆమోదం పొందిన మాచర్ల ప్రసాద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కాడే శంకర్, కొట్టే అశోక్, ముల్కల మల్లేశం, ఊకంటి మధుకర్, ఎలుక సంపత్, మోతె మహేందర్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సొల్లు బాబు, బొల్ల స్వామి, కామెడీ శ్రీనివాస్ రెడ్డి, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, మేకల రవీందర్‌లు మినహా ఇతరుల అదనపు నియామకాలే చెల్లవని తెలిపారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా కొత్తకొండ శంకర్


శంకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 6: కాంగ్రెస్‌పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా కొత్తకొండ శంకర్‌ను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ అలుగునూర్‌లోని క్యాంప్ ఆఫీస్‌లో శంకర్‌ను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో బాధ్యతను అప్పగించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్‌కు, లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య, టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ రూపిరెడ్డి దేవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో కోరా జాన్సన్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కోరా జాన్సన్ స్కూల్ డైరెక్టర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, 6: నగరంలో ఆదివారం జరిగిన గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ కప్ నిర్వహించిన జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కరీంనగర్‌లోని కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు ఎమ్.శ్లోకా, పి.అనన్య, ఎమ్.మనస్విని కరాటేలో ప్రతిభ కనబరచి బ్రాంజ్ మెడల్స్ కైవశం చేసుకున్నారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి అభినందించారు.

వైద్యులను నియమించాలని కలెక్టర్‌కు వినతి

హుజూరాబాద్, ఆగస్టు 6: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్యులను వెంటనే నియమించాలని మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కోరినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న వైద్యులు ఇటీవల బదిలీ కాగా, వారి స్థానంలో వెంటనే వైద్యులను నియమించాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తానని ప్రణవ్ తెలిపారు

బాల్యం నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి

సైదాపూర్, ఆగస్టు 6: విద్యార్థులు బాల్యం నుంచే సేవాభావం అలవర్చుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ 86వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలి


ధర్నా చేస్తున్న మైలారం గ్రామస్థులు

గన్నేరువరం, ఆగస్టు 6: మండలంలోని మైలారం గ్రామంలో సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు రెవెన్యూ అధికారుల అండతో కబ్జా చేసి పట్టా చేసుకున్నారని, గ్రామస్థులు మంగళవారం తహశీలారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మైలారంకు చెందిన వరాల మొండయ్య, వరాల గంగయ్య, వరాల రమాదేవి సత్తయ్యలు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు. వీరు గ్రామంలో ఊర చెరువు పక్కనే ఉన్న సర్వే నంబర్ 229లోని సుమారు ఏడు ఎకరాల భూమిని రెవెన్యూ అధికారుల అండతో వారి పేరున పట్టా పొందారు. ప్రభుత్వ భూమిని మార్పిడి చేయడానికి సహకరించిన రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాదసి కుమారస్వామి, నూకల చింటు, బుర్ర శ్రీనివాస్, మర్రి వెంకటమల్లు,రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలు చేపట్టాలి

తిమ్మాపూర్, ఆగస్టు6:గ్రామీణ ప్రాంతాల్లో నూతన అవిష్కరణలు తీసుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జిల్లా ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ పి.మణిదీప్ పేర్కొన్నారు. స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఇంటింటా ఇన్నోవేషన్, జిల్లా సెన్సిటైజేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రటరీ జువ్వాడి సుమీత్‌సాయి, ప్రిన్సిపాల్ కె.ఎస్.రావు, డీన్ పీకె.వైశాలి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ సెల్ ప్రెసిడెంట్ ఎం.మణికందన్, కోఆర్డినేటర్ జగదీశన్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలి

జమ్మికుంట, ఆగస్టు 6: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాల సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వాసుదేవరెడ్డి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో జమ్మికుంటకు 533డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, 2017లో అప్పటి మంత్రి ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఏడు సంవత్సరాలు పూర్తి అవుతున్నా నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేయక పోవడం బాధాకరం అన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి


ఎల్ఎండీలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి


జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి


జమ్మికుంటలో జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఆర్‌బీ ఏసీపీ జి.విజయ్‌కుమార్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీపీఓ ఏఓ మునిరామయ్య, ఆర్ఐ శ్రీధర్‌రెడ్డిలు నివాళులర్పించారు.

●**గణేశ్‌నగర్:** కరీంనగర్ సర్కిల్ టీజీ ఎన్పీడీసీఎల్ సమావేశం మందిరంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విజయేందర్ రెడ్డి, రూరల్ డీఈ ఎం తిరుపతి పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ నేత ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర గొప్పదని విశ్వ బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ వేములవాడి ద్రోణాచారి అన్నారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేపా నాయకులు కట్ట విష్ణువర్ధన్, బండ్ల శివప్రసాద్, గజ్జెట హరిహరాచారి, యాస్వాడ అంజన్న, వీరబ్రహ్మం, సత్యనారాయణ పాల్గొన్నారు.

● ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ జాతిపిత అని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు హర్మిందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

●తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, దర్శిల్లి క్రాంతి, సాంబయ్య, సంపాది అశోక్, కళ్లెపెల్లి నవీన్ పాల్గొన్నారు.

●జయశంకర్ విగ్రహానికి ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు నివాళులర్పించారు.

●**భగత్‌నగర్:** జయశంకర్ జయంతిని కరీంనగర్‌లోని బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డిలు జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డిప్యూటీ చీఫ్ పర్సన్ మేనేజర్ విలాస్‌రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య పాల్గొన్నారు.

●కొత్తపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ రామోజు రవీంద్రాచారి, కంచర్ల వెంకట రమణాచారి, ఉపాధ్యక్షుడు తిప్పారపు రవీంద్ర, తిప్పారపు అంజనేయ చారిలు నివాళులర్పించారు.

●**కరీంనగర్ రూరల్:** నగునూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.టి మాలతి, వైస్ ప్రిన్సిపాల్ డా.జి సమత పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** తెలంగాణ సాధన కోసం అహర్నిషలు పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ప్రభుత్వం పరంగా నిర్వహించడం హర్షదాయకమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎల్ఎండీలోని క్యాంప్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నివాళులర్పించారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో జయశంకర్ జయంతిని నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య, ప్రిన్సిపాల్‌లు ఆంజనేయరావు, శారద, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్ రూరల్:** మండలంలోని సింగాపూర్ గ్రామంలోని విఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జయశంకర్ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజిత పాల్గొన్నారు.

●**జమ్మికుంట:** పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జయశంకర్ జయంతిని నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, తహశీల్దార్ రమేష్, సీఐ వరంగంటి రవి, కమిషనర్ మహమ్మద్ ఆయాజ్, ఏవో గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ పాల్గొన్నారు.

●**చొప్పదండి:** జయశంకర్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నవీన్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శరత్ చంద్ర, మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ నాగరాజు, వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, రెవెల్లి ప్రభుత్వ పాటశాలలో యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

●**గంగాధర:** గంగాధరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మార్కెట్ కమిటీ, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

●**రామడుగు:** గుండి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం దయాకర్ పాల్గొన్నారు.

●**సైదాపూర్:** సైదాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో జయశంకర్ జయంతి నిర్వహించారు.

●**చిగురుమామిడి:** మండలంలో విశ్వకర్మ సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రవీందర్, విశ్వకర్మ సంఘం నాయకులు రాజ్‌కుమార్, చెల్పూరి విష్ణుమాచారి, సాంబమూర్తి, శ్రీరాములు, సత్తయ్య పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** మండలంలోని తాడికల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6: నగరంలో వివిధ పథకాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన 32వ డివిజన్ కట్టరాంపూర్, వినాయకనగర్‌లో కార్పొరేటర్ మర్రి భావన సతీష్‌తో కలిసి 28 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా కోతిరాంపూర్ శ్రీగిద్దెపెరుమాళ్లస్వామి ఆలయ ప్రాంగణంలోని మంచినీటి రిజర్వాయర్‌లో నీటి స్వచ్ఛతను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సువార్త, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 6: కరీంనగర్ మండలంలో విషజ్వరాలు పెరుగుతున్నాయని, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాడి శెట్టి సంతోష్ కోరారు. మంగళవారం కరీంనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మునిగంటి కుమార్, సుధాకర్, పాశం తిరుపతి, తోట సాయి, దేవరకొండ అజయ్, గాండ్ల గోపాల్, మల్లెత్తుల దేవేందర్, వెంకటేశ్వర్ రావు, గొల్లపల్లి ప్రవీణ్, పుట్టపాక శ్రీధర్, యండి అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి



నృత్యాలు చేస్తున్న అల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు

భగత్‌నగర్, ఆగస్టు6: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మంగళవారం యూఫోరియా కల్చరల్ కార్యక్రమంలో విద్యార్థులు హంగామా సృష్టించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. అధ్యాపకులు బోధించిన విషయాలను సమగ్రంగా సాధన చేసి విజయానికి చేరువ కావాలన్నారు. విద్యార్థి బాల్యం నుంచే నిర్దేశించిన మార్గంలో పయనించాలన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సాహం అందిస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. వేడుకల్లో భాగంగా అధ్యాపకులను, విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డిని పలువురు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం ఉద్యమంలా చేపట్టాలి


ముంజంపల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, ఆగస్టు 6: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని ముంజంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడివో వరలక్ష్మీ, వైద్యులు అలేఖ్య, వివిద శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● కరీంనగర్ టౌన్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో స్వచ్ఛదనం-పచ్చదనంపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశనం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కరీంనగర్ తహసీల్దార్ సీహెచ్ రాజు అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బొమ్మకల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలకు తహసీల్దార్ సిహెచ్ రాజు పాల్గొని ట్యాంక్‌లను పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రొఫెసర్ జయంతి వేడుకలను నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని పలు వార్డులలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్ర మాన్ని సీడీఎంఏ డిప్యూటీ డైరెక్టర్ వి సాయినాథ్, అడిషనల్ డైరెక్టర్ డి జాన్ సామ్‌లు మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య, భూపాల్‌రెడ్డి, కిషన్‌రావు, బషీర్ పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులు మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

గద్దర్ చరిత్ర మరువలేనిది

సుభాష్‌నగర్, ఆగస్టు 6: ప్రజా యుద్ధనౌక గద్దర్ చరిత్ర మరువలేనిదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య, దళిత మక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రథమ వర్ధంతి నిర్వహించారు.

● సుభాష్‌నగర్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. శ్రీనివాస్‌జాదవ్, పెంద్యాల అంజయ్య, మొగిలి సతీష్, కనకం రామకృష్ణ, ఎన్ ఓదెలు, బాపిరెడ్డి, బుర్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో గద్దర్ ప్రథమ వర్ధంతి వాకర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో స్వర్గీయ ప్రజా యుద్దనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి వేడుకలను మంగళవారం యువకులు ఘణంగా నిర్వహించారు.

తల్లిపాల వారోత్సవాలు

కరీంనగర్ రూరల్, ఆగష్టు6: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో లయన్స్ క్లబ్ స్మార్ట్ సిటీ, లయన్స్‌క్లబ్ బొమ్మకల్ సేవా ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ, పండ్లు, బ్రెడ్, పంపిణీ చేశారు. సీనియర్ వైద్యులు డాక్టర్ కాంరెడ్డి మాదవరెడ్డి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటి క్లబ్ ప్రెసిడెంట్ లయన్ మంద రమణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: శ్రీనగర్ మహిళా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గడప నిరంజన, కార్యదర్శి కంటెవిజయ, ఉపాధ్యక్షురాలు కడారి విజయ, జాయింట్ సెక్రటరీ లావణ్య ఉన్నారు.

● శంకరపట్నం: తాడికల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

● చొప్పదండి: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణిలకు డ్రైఫ్రూట్స్,బ్రెడ్,బిస్కెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం,రాజేశ్ పవార్,తొడుపునూరి సత్యనారాయణ,సిరిపురం రాజు పాల్గొన్నారు.

● దేశాయిపేటలో ఐసీడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.ప్రత్యేక అదికారి శ్రావణ్‌కుమార్ రావు,సూపర్‌వైజర్ రమాదేవి,లక్ష్మి,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు,

ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలి

● ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఆగస్టు 6: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించి, రోగులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విలే కరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు మెరుగైన వైద్యం అందించామన్నారు. ఇటీవల చాలా మంది వైద్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి బదిలీపై వెళ్లారని, వారి స్థానంలో కొత్తగా వైద్యులెవరూ రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం హామీని నేరవేర్చాలి

హుజూరాబాద్‌రూరల్: కల్యాణలక్ష్మీ పథకంలో తులం బంగారం ఇస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీని నేరవేర్చాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ సందర్భంగా మాట్లాడారు. ఎంపీడీవో సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి ఉన్నారు.

● వీణవంక: ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదపు 86 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులు అందిచారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రైవేట్ డ్రైవర్ల ఆందోళన

భగత్‌నగర్, ఆగస్టు 6: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ప్రైవేట్ బస్సు డ్రైవర్లు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం ఓ డ్రైవర్ డ్యూటీకి వెళ్లే సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే మద్యం సేవించినట్లు వచ్చిందని ఆందోళనకు దిగారు. అసలు ఆ డ్రైవర్ ఎలాంటి మద్యం సేవించలేదని, తనకు మద్యం తాగే అలవాటే లేదని డ్రైవర్‌తో పాటు, మిగతా డ్రైవర్లంతా ఆందోళనకు దిగారు. ఈ విషయమై డిపో మేనేజర్ మల్లయ్యను సంప్రదించగా డ్రైవర్ డ్రంక్ డ్రైవ్‌లో మద్యం సేవించినట్లు తేలిందని, విధులకు తీసుకోలేదన్నారు. గంట తర్వాత డ్రైవర్లు విధుల్లోకి రావడంతో బస్సులు యథావిధిగా నడిచాయి.

ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించాలి

భగత్‌నగర్, ఆగస్టు 6: నగరంలో ఇంటింటా వైద్య సర్వే నిర్వహించాలని సీపీఐ నగర కార్యదర్శి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు డిమాండ్ చేశారు. వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడంలో మున్సిపల్ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు విఫల మయ్యారన్నారు.

వివేకానంద అధ్యాపకుడికి డాక్టరేట్

గణేశ్‌నగర్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎంఎ సలీంకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగంలో ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి పర్యవేక్షణలో మేనేజ్మెంట్ ఆఫ్ టూరిజం సర్వీసెస్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ స్టడీ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసింది.

నేడు ఆలయంలో టెండర్లు

కరీంనగర్ కల్చరల్ ఆగష్టు 6: నగరంలోని జ్యోతీనగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి అమ్మవారి చీరల ప్రోగు, టెంకాయలు, పూజా సామాగ్రి అమ్మకాలు, కొబ్బరిముక్కల ప్రోగు చేసుకునే హక్కుల కోసం టెండర్ల ద్వారా వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాలు

కరీంనగర్ కల్చరల్ ఆగష్టు6: నగరంలోని ఓ కల్యాణమండపంలో మంగళవారం మారుతీనగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో చెరుకు సంతోష్‌శర్మ వైదిక నిర్వహణలో సామూహిక మంగళగౌరీ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్కీ డ్రా తీశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు యాంసాని అశోక్, ఎలుగూరి మధు, కోశాధికారి మోటూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

సొసైటీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించండి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6: మెడికల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ నిధులు కాజేసేందుకు సత్యనారాయణ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నందున వీటిపై విచారణ జరిపించి సొసైటీ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని సొసైటీ సభ్యుడు సాదమల్ల సన్నీ ఎడ్వర్డ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్, ఆగస్టు 6: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మంగళవారం స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ శిబిరం క్లబ్ సభ్యులు కనపర్తి సత్యనారాయణ, తిప్పర్తి శ్రీనివాస్‌తో పాటు ఇతరులు కలిసి 10మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, గుండోజు లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

సుభాష్‌నగర్, ఆగస్టు 6: మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక రాంనగర్‌లో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప, అనునూప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

గన్నేరువరం, ఆగస్టు 6: నిరుపేదలకు ఆపద సమయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ వరంలా పనిచేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన 76మంది సీఎం రిలీఫ్‌ఫండ్, 8మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూత

హుజూరాబాద్, ఆగస్టు 6: హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సేవ్ ద ట్రీస్.. సేవ్ ద ఎర్త్ నిర్వాహకుడు వర్థినేని రవీందర్‌రావు మంగళవారం చేయూత అందించాడు. పాఠశాలలోని మరుగుదొడ్లకు తలుపులు, నల్లాలు, స్టేజీ నిర్మాణం, గేట్, ప్రహరీ నిర్మాణాలను ప్రారంభించారు. సుమారు రూ.60వేల సొంత ఖర్చులతో ఈ పనులను చేయిస్తున్నాడు.

ఎమ్మెల్యేకు వినతి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 6: చెల్పూర్ గ్రామంలోని చిన్న చెరువు- పెద్ద చెరువు మధ్య లింకె కెనాల్ మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని, బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి చెల్పూర్ మాజీ సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు. .

హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

ఇల్లందకుంట, ఆగస్టు 6: వర్షాకాలం దృష్ట్యా ఇల్లందకుంట మండలాన్ని జిల్లా ఉన్నత వైద్యాధికారులు సందర్శించి గ్రామ గ్రామాన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని బీజేపీ యువ మోర్చా సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి మంగళవారంఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మార్కెట్ కార్యదర్శికి సన్మానం

జమ్మికుంట, ఆగస్టు 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి గూగులోతురెడ్డి నాయక్, అధికారులు లక్ష్మణ్, బాబాలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం మార్కెట్ సిబ్బంది, అడ్తిదారులు, దాడ్వాయిలు, హమాలీ కార్మికులు ఘణంగా సన్మానించారు. మార్కెట్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన మల్లేశంను సన్మానించారు.

నియామకం

రామడుగు, ఆగస్టు 6: మండల కేంద్రానికి చెందిన లంక నర్సింగ్‌ను జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి మండల కన్వీనర్‌గా నియమిస్తూ ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రామడుగు, ఆగస్టు 6 : మండలంలోని వెదిరకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూరెల్ల రత్నాకర్ తండ్రి పూరెల్ల మల్లయ్య మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు.

మహిళపై పోలీసుల చర్య సరికాదు

చిగురుమామడి, ఆగస్టు6: షాద్‌నగర్‌లో ఓ నిరుపేద దళిత మహిళపై కర్కశంగా వ్యవహరించిన పోలీస్‌లను విధుల నుంచి తొలగించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబారి కొమురయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె స్వామి, అందె నుల్లయ్య, మహంకాళి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.